సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 3 । నవంబర్ । 2023



రైళ్ల పునరుద్ధరణ

గురువారం నుంచి విశాఖపట్నం–పలాస పాసింజర్ రైళ్లను పునరుద్ధరించినట్లు సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. 4లో



ప్రభం'జనం'

మాడుగులలో గురువారం జరిగిన వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. 4లో



కబడ్డీ పోటీలు ప్రారంభం

క్రీడాకారులకు సమాజంలో ఉన్నతమైన గుర్తింపు ఉంటుందని జేఎస్‌టీయూ(వీ) పీడీ నాగరాజు అన్నారు. 4లో

ఆతిథ్యం అదుర్స్



వేదికపై సీఎం వైఎస్ జగన్, కేంద్ర మంత్రి షెకావత్, రాష్ట్ర మంత్రులు అంబటి రాంబాబు, గుడివాడ అమర్‌నాథ్, విడదల రజని, ఇతర ప్రతినిధులు

దొండపర్తి : విశాఖ ఆతిథ్యం అదిరిపోయింది. విదేశీ ప్రతినిధులను మంత్రముగ్ధులను చేసింది. మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సదస్సుకు వేదికైన విశాఖ.. 90 దేశాలకు చెందిన 1200 విదేశీ ప్రముఖులకు గ్రాండ్ వెల్కమ్ చెప్పింది. 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ కాంగ్రెస్ ప్లీనరీ తొలి రోజు సమావేశం గురువారం రాడిసన్ బ్లూ హోటల్‌లో విజయవంతంగా జరిగింది. కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ రాష్ట్రంలో అత్యాధునిక నీటి పారుదల విధానాలు, సాగునీటి రంగం, వ్యవసాయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను

- ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సదస్సుకు వేదికైన విశాఖ
- 90 దేశాల నుంచి 1,200 మంది ప్రతినిధులు హాజరు
- కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో కలిసి సదస్సు ప్రారంభించిన సీఎం జగన్
- భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీస్ శాఖ

వివరించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో నీటి సంరక్షణ, డ్యామ్‌ల పరిరక్షణ, నదుల అనుసంధానానికి చేపట్టిన ప్రణాళికలను కేంద్రమంత్రి షెకావత్ విశదీకరించారు.





హాజరైన వివిధ దేశాల ప్రతినిధులు

మంత్రముగ్ధులైన విదేశీ ప్రతినిధులు

ఐసీఐడీ సదస్సుకు వివిధ దేశాలకు చెందిన అంబాసిడర్లు, మంత్రులు, జలవనరుల రంగ నిపుణులు వచ్చారు. 57 ఏళ్ల తరువాత భారత్‌లో జరుగుతున్న ఈ అంతర్జాతీయ సదస్సుకు విశాఖ అతిథ్యమిచ్చింది. వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు విశాఖ అందాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. రాడిసన్ బ్లూ హోటల్ వద్ద సందడి చేశారు. సదస్సులో కీలక ప్రసంగాలు, ప్రదర్శనలు అనంతరం ప్రతినిధులు బీచ్ అందాలకు ఫిదా అయిపోయారు. ఈ ప్రతినిధుల కోసం జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లను చూసి వారు మురిసిపోయారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రతినిధులు బసచేసే హోటల్ నుంచి వారి రాడిసన్ బ్లూకు వచ్చే వారికి ప్రత్యేక బందోబస్తు కల్పించారు. దీంతో తొలి రోజు సదస్సు ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల 8వ తేదీ వరకు ఈ సదస్సు జరగనుంది.



రాడిసన్ బ్లూ హోటల్‌లో విదేశీయుల సందడి

సీఎం జగన్‌కు ఘన స్వాగతం



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న మేయర్ హరివెంకటకుమారి, మంత్రి విడదల రజని, కలెక్టర్ మల్లికార్జున, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గురువులు

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఐసీఐడీ సదస్సు కోసం గురువారం ఉదయం 8.52 గంటలకు ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. ఆయనతోపాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు వచ్చారు. ఇక్కడ నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ మాధవి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ నుంచి 9.08 గంటలకు హెలికాప్టర్‌లో మధురవాడ ఐటీ హిల్–3కు బయలుదేరారు.

అక్కడ హెలిప్యాడ్ వద్ద సీఎంకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పోలీస్ కమిషనర్ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ స్వాగతం పలికారు. అనంతరం అక్కడ వేచి ఉన్న వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, అదీప్ రాజ్, ఉమాశంకర్ గణేష్, ఎమ్మెల్సీలు పండుల రవీంద్ర బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, విశాఖ ఉత్తర, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తలు కె.కె.రాజు, ఆడారి ఆనంద్ కుమార్, నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, ఐసీడీఎస్ ప్రాంతీయ చైర్‌పర్సన్ మంతెన మాధవి, మాజీ ఎంపీ కిల్లి కృపారాణి, ప్రముఖ ఆడిటర్ జి.వెంకటేశ్వరరావు, ఇతర నాయకులను పేరుపేరున పలకరించారు. అనంతరం ఆయన రాడిసన్ హోటల్‌కు వెళ్లి సదస్సును ప్రారంభించారు. సదస్సు ముగిసిన తరువాత సీఎం మధ్యాహ్నం 11.55కు ఐటీ హిల్–3కు చేరుకున్నారు. అక్కడ మంత్రులు కొట్టు సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, ఇతర నాయకులు, అధికారులు సీఎంకు వీడ్కోలు పలికారు. హెలికాప్టర్‌లో విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకొని 12.22 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరారు.

రైతు బజార్లలో ఫిష్ ఆంధ్ర స్టాల్స్!

- తొలిసారిగా ఎంవీపీలో నాలుగు ఏర్పాటు
- త్వరలో గోపాలపట్నం, పెదవాల్తేరుల్లో కూడా..
- ఇప్పటికే విశాఖ జిల్లాలో 24 యూనిట్లు
- మిగిలినవి మున్ముందు ఏర్పాటుకు సన్నాహాలు

సాక్షి, విశాఖపట్నం: వినియోగదార్లకు పరిశుభ్రతతో కూడిన తాజా చేపలను అందుబాటులో ఉంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర పథకాన్ని ప్రవేశ పెట్టింది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా విశాఖపట్నం జిల్లాకు 42 ఫిష్ ఆంధ్ర యూనిట్లు మంజూరయ్యాయి.

వీటిలో ఇప్పటివరకు 24 యూనిట్లు ఏర్పాటయ్యాయి. ఇప్పుడు రైతుబజార్లలోనూ వీటిని ఏర్పాటు చేయడానికి మత్స్యశాఖ అధికారులు సన్నద్ధమయ్యారు. తొలిసారిగా నగరంలోని ఎంవీపీ రైతుబజార్‌లో నాలుగు ఫిష్ ఆంధ్ర స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటిని నలుగురికి కేటాయించారు. ఇప్పటికే 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ స్టాళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. వీటిని శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభించనున్నారు. త్వరలో గోపాలపట్నం, పెదవాల్తేరు రైతుబజార్లలోనూ ఫిష్ ఆంధ్ర ఔట్‌లెట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ రైతుబజార్లలో వీటి లోటుపాట్లను పరిగణలోకి తీసుకుని ఇతర రైతుబజార్లలోనూ అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నామని జిల్లా మత్స్యశాఖ అధికారి జి.విజయ సాక్షికి చెప్పారు. అలాగే మున్ముందు మిగిలిన ఔట్‌లెట్లను అర్హులైన వారికి మంజూరు చేయనున్నట్టు తెలిపారు. ఒక్కో ఔట్‌లెట్‌కు రూ.2 లక్షల వరకు ఖర్చవుతుంది. ఇందులో గరిష్టంగా రూ.70 వేల వరకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. మరోవైపు ఫిష్ ఆంధ్ర ఔట్‌లెట్లలో విక్రయించే చేపలు తాజాదనంతో పాటు పరిశుభ్రంగా ఉంటాయి. అందువల్ల ఆరోగ్యకరమైన ఈ చేపలను కొనుగోలుకు వినియోగదార్లు ఆసక్తి చూపిస్తున్నారు. ఫిష్ ఆంధ్ర యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీని, ప్రోత్సాహకాలను వినియోగించుకుని యువత ఉపాధి పొందాలని జిల్లా మత్స్యశాఖ అధికారి విజయ కోరారు.



ఫిష్ ఆంధ్ర యూనిట్

త్వరలో బీఆర్‌టీఎస్ భూనిర్వాసితుల సమస్య పరిష్కారం

కలెక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

దొండపర్తి: సింహాచలం– అడవివరం బీఆర్‌టీఎస్ రోడ్డు భూనిర్వాసితుల సమస్య త్వరలోనే పరిష్కారం కానుందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. గురువారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మలతో కలిసి సింహాచలం– అడవివరం భూ నిర్వాసిత సమస్యపై వీఎంఆర్డీఏ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింహాచలం – అడవివరం భూ నిర్వాసితులకు సంబంధించి కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. భూ నిర్వాసితులకు ఇళ్ల నిర్మాణం, టీడీఆర్‌లు అందించడంలో సత్వర న్యాయం అందిస్తామని తెలిపారు. టీడీఆర్ సమస్య పరిష్కారంలో చొరవ చూపించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ బీఆర్టీఎస్ రోడ్డు నిర్మాణానికి స్వచ్ఛందంగా తమ స్థలాలు ఇచ్చిన వారిలో 60 శాతానికి పైగా ఇళ్లు, అలాగే ఇంటి స్థలం కోల్పోయిన వారికి ప్రభుత్వం తరుపున ప్రత్యామ్నాయ మార్గంలో ఇళ్ల నిర్మాణం చేపట్టి అందివ్వాలని, అదేవిధంగా గతంలో అడవివరం బీ ఆర్టీఎస్ రోడ్డు నిర్మాణం కోసం స్థలం ఇచ్చిన వారికి అందవలసిన టీడీఆర్‌లు పెండింగ్ ఉన్న మాట వాస్తవమే అని పేర్కొన్నారు. సాంకేతిక సమస్య కారణంగా అనుకున్న సమయానికి టీడీఆర్‌లు అందించలేకపోయామన్నారు. గతంలో ఇళ్ల స్థలం కోల్పోయిన వారికి దేవస్థానం భూ సమస్య ఉన్న కారణంగా టీడీఆర్ ఇవ్వలేదని,ఈ విషయాన్ని తాను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. దానికి ఆయన సుముఖత వ్యక్తం చేశారన్నారు. టీడీఆర్ అందించిన తరువాత బీఆర్టీఎస్ రోడ్డు నిర్మాణం చేపడతామని, ఈ విషయంలో కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ అన్ని విధాలా సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్డీఏ సిబ్బంది, బీఆర్టీఎస్ బాధితులు పాల్గొన్నారు.

సింహగిరిపై నూతన షాపింగ్ కాంప్లెక్స్

వ్యాపారులతో చర్చలు జరిపిన దేవదాయశాఖ ఏడీసీ రామచంద్రమోహన్

సింహాచలం : ప్రసాద్ స్కీమ్‌లో భాగంగా సింహగిరిపై ఆధునిక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించనున్నట్టు రాష్ట్ర దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సింహాచలం దేవస్థానంలో రూ.54 కోట్లతో ప్రసాద్ పథకం పలు అభివృద్ధి పనులు చేసేందుకు ఇప్పటికే డీపీఆర్ సిద్ధం చేసిన విషయం తెలిసిందే. దానిప్రకారం దేవస్థానం స్థలాలను క్లియర్‌చేసి అప్పగించాల్సి ఉంది. పనులు కూడా ఇప్పటికే ప్రారంభించాల్సి ఉంది. అయితే పలు కారణాలతో పనులు ఆలస్యమవుతున్నాయి. ముఖ్యంగా సింహగిరిపై వర్తకుల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం విషయంలో వర్తకులకు, దేవస్థానం అధికారుల మధ్య ఒప్పందం కుదరకపోవడంతో పలు మార్లు చర్చలు జరిగాయి. ఇప్పటి వరకు ఒక్క కొలిక్కిరాలేదు. దీంతో రాష్ట్ర దేవదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, కమిషనర్ ఆదేశాలతో రామచంద్రమోహన్ వ్యాపారులతో చర్చలు జరిపేందుకు సింహగిరికి గురువారం వచ్చారు. సింహగిరిపై ఉన్న కాటేజీలో వ్యాపారులతో సమావేశమయ్యారు. గతంతో ఇంజినీరింగ్ అధికారుల తప్పిదాల వల్ల షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రణాళికబద్ధంగా నిర్మించలేదని వ్యాపారులు వాపోయారు. ప్రస్తుతం ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ స్థానంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్ ఏ విధంగా నిర్మిస్తారో తెలియడం లేదన్నారు. తమకు ఆమోదయోగ్యంగా ఉండేలా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రామచంద్రమోహన్ మాట్లాడుతూ గతంలో ఉన్న దానికంటే మెరుగైన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని, ఎవ్వరికీ అన్యాయం జరగదని స్పష్టం చేశారు. 7 నెలల్లో కొత్త షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, సింహగిరి వర్తక సంఘం అధ్యక్షుడు మొగ్గ కిరణ్, ఉపాధ్యక్షుడు ఎస్.రాజు,సెక్రటరీ గుడ్ల గురునాథరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ దొంతల శంకర్, మాజీ అధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, వ్యాపారులు బంటుబిల్లి సురేష్, కస్తూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి

దొండపర్తి: టెక్ మహీంద్రా ఫౌండేషన్ సహకారంతో నిర్మాణ్ సంస్థ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థ డైరెక్టర్ మయూర్ పట్నాల తెలిపారు. టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 6వ తేదీలోగా 9502874304, 9908104113 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అల్పాహారంలో పురుగులు లేవు

- ఉద్దేశపూర్వకంగా వీడియో తీసి వైరల్ చేసిన నాల్గో తరగతి ఉద్యోగి
- నిర్ధారించిన ముగ్గురు వైద్యుల కమిటీ
- అతనిపై సీసీఏ నిబంధనల ప్రకారం చర్యలు: సూపరిండెంటెంట్



కేజీహెచ్ డైట్ క్యాంటీన్‌లో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి అప్పారావు

మహారాణిపేట: కేజీహెచ్‌లో రోగులకు ఇచ్చిన అల్పాహారంలో ఎటువంటి పురుగులు లేవని, నాల్గో తరగతి ఉద్యోగి ఉద్దేశపూర్వకంగా ఇదంతా చేశారని త్రిసభ్య కమిటీ తేల్చింది. కేజీహెచ్‌లో రోగులకు బుధవారం అందజేసిన అల్పాహారంలో తెల్ల పురుగులు ఉన్నట్టు ఆరోపణలు రావడంతో సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ ముగ్గురు వైద్యులతో విచారణ కమిటీని నియమించారు. ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.పద్మజ, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ ఎ.వాసుదేవ, కార్డియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హేమమాలిని గురువారం కార్డియాలజీ విభాగంలో విచారణ చేపట్టారు. ఆరోపణలు చేసిన కోటవురట్ల మండలానికి చెందిన ఎం.సత్యవతి, ఆమె బంధువులు, మిగతా రోగులు, వారి బంధువుల నుంచి వివరించారు. అనంతరం నివేదికను సూపరింటెండెంట్‌కు సమర్పించారు. నివేదికను పరిశీలించిన ఆయన నాల్గో తరగతి ఉద్యోగి ఉద్దేశపూర్వకంగా వీడియో తీసినట్లు వెల్లడించారు. రోగుల్లో ఉన్న అతని బంధువులతో అల్పాహారంలో పురుగులు ఉన్నట్లు చెప్పించి.. వీడియో చిత్రీకరించి వైరల్ చేసినట్లు చెప్పారు. ఆ ఉద్యోగిపై సీసీఏ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని డైట్ కాంట్రాక్టర్, చీఫ్ డైటీషియన్ మూర్తిని ఆదేశించారు.

కేజీహెచ్‌లో 'ఆహార భద్రత' తనిఖీలు

కేజీహెచ్‌లో రోగులకు అందిస్తున్న అల్పాహారంలో పురుగులు ఉన్నట్లు వచ్చిన వార్తలపై ఆహార భద్రత విభాగం స్పందించింది. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అప్పారావు ఆధ్వర్యంలో అధికారులు గురువారం కేజీహెచ్‌లోని డైట్ క్యాంటీన్‌లో తనిఖీలు చేపట్టారు. క్యాంటీన్, స్టోర్, వంటశాల, సరకులు ఇచ్చే గదులు, సిద్ధం చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో 17 రకాల ఆహార పదార్థాల నమూనాలను సేకరించి, రీజినల్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీకి పంపారు. నివేదిక బట్టి చర్యలు తీసుకుంటామన్నారు. కేజీహెచ్ చీఫ్ డైటీషియన్ హెచ్.వి.ఆర్ మూర్తి నుంచి పలు వివరాలు సేకరించారు. నిబంధనల ప్రకారం రోగులకు నాణ్యమైన ఆహారం అందజేయాలని డైట్ కాంట్రాక్టర్‌కు సూచించారు.

న్యూస్‌రీల్

20 శిబిరాల్లో 9,691 మందికి వైద్య సేవలు



35వ వార్డులో జగనన్న సురక్షలో కంటి పరీక్ష చేసుకుంటున్న ప్రజలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా గురువారం నగరంలోని 20 ప్రాంతాల్లో నిర్వహించిన శిబిరాల్లో 9,691 మందికి వైద్య సేవలందించినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన శిబిరాలను ఆయన సందర్శించి.. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేసినట్లు చెప్పారు. ఆయన వెంట జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, పలు శాఖల అధికారులు ఉన్నారు. శుక్రవారం 22 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో వెల్లడించారు.

జూలో ఆడ ఎలుగుబంటి మృతి



మృతి చెందిన ఎలుగుబంటి(ఫైల్)

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ఎలుగుబంటి మృతి చెందింది. ఇక్కడ ఎన్‌క్లోజర్‌లో హుషారుగా తిరిగే 20 ఏళ్ల ఆడ ఎలుగుబంటి దివ్య కొద్ది రోజుల కిందట కిడ్నీ సంబంధిత వ్యాధి బారిన పడింది. ఇక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ ఆరోగ్యం క్షీణించడంతో గురువారం మధ్యాహ్నం మృతి చెందినట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. దివ్య 2003లో జూలోనే జన్మించింది. ప్రస్తుతం జూలో రెండు ఎలుగుబంట్లు ఉన్నట్లు క్యూరేటర్ తెలిపారు.

మహిళా కళాశాలలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో 2023–24 ఏడాదికి స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ తెలుగు, ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ సోషల్ వర్క్, ఎం.కాం., ఎమ్మెస్సీ మ్యాథ్‌మెటిక్స్, మైక్రోబయాలజీ, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులకు సంబంధించి స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఆసక్తి గల విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 70322 70810, 93962 35303లో సంప్రదించవచ్చు.

పారా అథ్లెట్ లలితకు ఘన స్వాగతం



లలితకు స్వాగతం పలుకుతున్న నేత్ర విద్యాలయం యాజమాన్యం

కొమ్మాది: ఆసియా పారా గేమ్స్‌లో మహిళల 1,500 మీటర్ల టీ–11లో రజత పతకం సాధించి నగరానికి చేరుకున్న కిల్లికా లలితకు ఘన స్వాగతం లభించింది. బీచ్‌రోడ్డులోని వారిజా నేత్ర విద్యాలయానికి చెందిన లలిత చైనాలో జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో 1,500 మీటర్ల పరుగులో రజత పతకం సాధించిన సంగతి తెలిసిందే. గురువారం విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ఆమెను నేత్ర విద్యాలయం ప్రిన్సిపాల్ శిరీష, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. పతకాన్ని సాధించిన లలితను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

నేటి నుంచి తైక్వాండో జిల్లా జట్ల ఎంపిక

మధురవాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి అండర్–17, అండర్–14 కేటగిరీల్లో తైక్వాండో బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మధురవాడ ద్రోణంరాజు కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఎంపిక పోటీలు నిర్వహిస్తామని గేమ్స్ కన్వీనర్, బోయిపాలెం ఉన్నత పాఠశాల పీడీ ఎ.అప్పలరాజు తెలిపారు. ఎంపికైన జట్లు ఈ నెల 9, 10, 11 తేదీల్లో అన్నమయ్య జిల్లా కోడూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని చెప్పారు. శుక్రవారం అండర్–17 విభాగంలో బాల బాలికల జట్లు, శనివారం అండర్–14 విభాగంలో బాల, బాలికల జట్ల ఎంపిక ఉంటుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

క్లుప్తంగా

పెందుర్తిలో అనధికారిక బాణసంచా పట్టివేత


పెందుర్తిలో పట్టుబడిన బాణసంచా

పెందుర్తి: పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి సమీపంలోని నూకాలమ్మ ఆలయం వద్ద అనధికారికంగా నిల్వ ఉంచిన బాణసంచాను పెందుర్తి పోలీసులు పట్టుకున్నారు. వివరాలివీ.. పెందుర్తి కూడలి వద్ద ఓ ఆటోలో అనధికారికంగా తీసుకువచ్చిన బాణసంచాను నిల్వ చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రూ.2.50 లక్షల విలువైన బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీపీఆర్ విల్లా ప్రాజెక్ట్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజ్యసభ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

కొమ్మాది: రుషికొండ సమీపంలో వీపీఆర్ సంస్థ..లా సితాదల్ ప్రాజెక్ట్‌తో కలిసి అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న విల్లాలకు సంబంధించి ప్రాజెక్ట్ పోస్టర్‌ను రాజ్యసభ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. రుషికొండలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశాఖ సాగరతీరంలో అత్యాధునిక సౌకర్యాలతో విల్లాలు నిర్మించడం అభినందనీయమన్నారు. 30 ఎకరాల్లో సకల హంగులు, అత్యాధునిక సదుపాయాలతో ప్రతి ఒక్కరికీ నచ్చే రీతిలో ఈ ప్రాజెక్ట్‌ను తీర్చిదిద్దుతున్నట్లు వీపీఆర్ సంస్థ ప్రతినిధులు అనిల్, ప్రవీణ్ తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఐ ఎక్స్‌పో

బీచ్‌రోడ్డు: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ విశాఖపట్నం(ఐఐఏ) ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నోవాటెల్ వేదికగా ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ మెటీరియల్స్(ఏఐ) ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు ఐఐఏ చైర్మన్ రాజేష్ తెలిపారు. ఈ ఎక్స్‌పోలో కేవలం బిల్డింగ్ సామగ్రిని ప్రదర్శించడమే కాకుండా నిర్మాణ రంగంలో వస్తున్న మార్పులు, సాంకేతిక పరిణామాలు, సమస్యలు, పరిష్కారాలపై వృత్తిపరమైన నిపుణులతో అవగాహన కల్పిస్తామన్నారు. శుక్ర, శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న ఈ ఎక్స్‌పోలో 40 మంది ఎగ్జిబిటర్స్ 60 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆర్కిటెక్ట్ కాలేజీ, విశాఖపట్నం విద్యార్థులు తమ ప్రాజెక్ట్‌లను ఇక్కడ ప్రదర్శిస్తారని రాజేష్ వెల్లడించారు.

దారులన్నీ జన గోదారులయ్యాయి... అన్ని పల్లె మార్గాలు అడుగులో అడుగు వేస్తూ మాడుగుల చేరాయి... ఒక్కొక్కరిగా...గుంపులుగా... బృందాలుగా... సమూహాలుగా చేరి.. ప్రభంజనంగా మారారు.. గతుకుల బతుకులు మార్చి... పాలన సారథులుగా అందలమెక్కించిన సాధికార ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలుగా ఘాట్‌రోడ్డుకు భారీగా తరలివచ్చారు. పొలిమేర కూడా కనిపించనంతగా పోటెత్తారు...అభివృద్ధి చేసి చూపిస్తే అభిమానం ఇలాగే ఉంటుందన్నట్టుగా... అసంఖ్యాకంగా హాజరయ్యారు. సామాజిక సాధికార బస్సు యాత్రకు బ్రహ్మరథం పట్టారు. జరిగిన అభివృద్ధి, పాలనలో వచ్చిన మార్పులు.. ప్రభుత్వం, పార్టీలో అన్ని వర్గాల వారికి కేటాయించిన పదవులు, ఇతర వివరాలను మంత్రులు, అభిమాన నేతలు తెలపడంతో ఆసాంతం విన్నారు... హర్షధ్వానాలతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. వెరసి ప్రత్యర్థులు సైతం శభాష్ అన్నట్టుగా మాడుగుల నియోజకవర్గంలో బస్సు యాత్ర సాగింది...


తరలివచ్చిన మహిళా లోకం

• ప్రతిధ్వనించిన సామాన్యుడి గుండె చప్పుడు

ప్రభం‘జనం’

- సామాజిక సాధికార బస్సు యాత్రలో వెల్లువెత్తిన అభిమానం
- జన సంద్రాలుగా మారిన మాడుగుల రహదారులు

సాక్షి, అనకాపల్లి: మాడుగుల నియోజకవర్గంలో గురువారం జరిగిన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథంపట్టారు. వేలాది బైక్‌లు, ఆటోలు, వందలాది కార్లతో ర్యాలీగా యాత్ర సాగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 53 నెలల పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన మంచిని వివరించడానికి నిర్వహించిన ఈ యాత్ర జైత్రయాత్రలా జరిగింది. బస్సుయాత్ర, బహిరంగ సభల్లో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్న దొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం, మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో కె.కోటపాడులో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన బస్సు యాత్రకు ప్రజలు అడుగడుగున


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, చిత్రంలో మంత్రులు బొత్స, ధర్మాన, అమర్

బ్రహ్మరథం పట్టారు. బస్సుయాత్ర ప్రారంభమైన ప్రాంతం మహిళల కోలాటాలు, జై జగన్..జై బూడి నినాదాలతో సందడిగా మారింది. ఈ యాత్ర సాగిన గ్రామాల ప్రధాన కూడళ్లలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ ఎత్తున బాణసంచా కాల్చి స్వాగతం పలికారు. మొదట కె.కోటపాడు శివాలయం వద్దకు చేరుకున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణలకు వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం బస్సు యాత్రను మంత్రి బొత్స సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. బస్సుయాత్ర కె.కోటపాడు, సింగన్నదొరపాలెం, సూర్రెడ్డిపాలెం, ఎ.కోడూరు, వారాడ, వి.సంతపాలెం, ఆనందపురం గ్రామాల మీదుగా దేవరాపల్లి మండలంలోకి ప్రవేశించింది. అంతకుముందు కె.కోటపాడులోని ఆస్పత్రిని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి పరిశీలించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వీరితో మాట్లాడుతూ సీఎం జగన్ ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ఈ ఆస్పత్రి స్థాయిని 50 పడకలకు పెంచుతూ అదనపు భవన నిర్మాణాలకు, మౌలిక వసతులకు రూ.5.60 కోట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. అదనపు భవనాల నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన ఈ నెలాఖరునాటికి పూర్తయ్యేలా అధికారులు చర్యలను తీసుకోవాలని మంత్రి బొత్స సత్యనారాయణ సూచించారు.

వృద్ధుల ఫిర్యాదుల కోసం ప్రత్యేక సమయం

- 30 నిమిషాలు పొడిగించిన డయల్ యువర్ సీపీ

దొండపర్తి: సంరక్షణ కరువైన వృద్ధుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ప్రతి నెలా 1, 15 తేదీల్లో నిర్వహిస్తున్న డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని మరో 30 నిమిషాల పాటు పొడిగించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ సీపీ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తుండగా.. ఇకపై 12 నుంచి 12.30 వరకు కేవలం సంరక్షణ కరువైన వృద్ధుల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. గత రెండేళ్లలో వృద్ధ తల్లిదండ్రులతో అనుచితంగా ప్రవర్తించిన వారిపై ఏడు కేసులు నమోదు చేసి వారిపై చర్యలు తీసుకున్నట్లు సీపీ రవిశంకర్ తెలిపారు. వృద్ధ తల్లిదండ్రులను వారి కుటుంబ సభ్యులు నిర్లక్ష్యం చేసినా, ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పెట్టినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి ఇబ్బందులకు గురైన వారు సీపీ వాట్సాప్ నెంబర్ 9493336633 నెంబర్, లేదా పోలీస్ హెల్ప్‌లైన్ 112, నేషనల్ సీనియర్ సిటిజన్స్ హెల్ప్‌లైన్ నెంబర్ 14567కు తెలియజేయాలని సూచించారు.

విమ్స్‌లో దొరికిన కేస్ షీట్లు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో కొందరు ఇన్ పేషెంట్లకు సంబంధించి మాయమైన కేస్ షీట్లు దొరికాయి. ఇటీవల రోగుల కేస్ షీట్లు మాయం కావడంతో వైద్యాధికారులు ఆందోళనలో పడ్డారు. ఈ ఘటనపై రెండు రోజుల కిందట విమ్స్ డైరెక్టర్ కె.రాంబాబు నర్సింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నర్సింగ్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే కేస్ షీట్లు మాయమయ్యాయని నిర్ధారించి.. స్టాఫ్ నర్సులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని వెతికి తీసుకురావాలని ఆదేశించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టాలని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణను నియమించారు. గురువారం ఆయన సమక్షంలో నర్సింగ్ సిబ్బంది అన్ని వార్డులతో పాటు కేస్ షీట్లు భద్రపరిచిన గదులను తనిఖీ చేశారు. దీంతో కనిపించకుండా పోయిన అన్ని కేస్ షీట్లు దొరికినట్లు డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపారు. ఒక్కొక్కటి ఒక్కో చోట లభించిందన్నారు. ఇక నుంచి జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

‘అక్షయపాత్ర’ సేవలు భేష్


అక్షయపాత్ర వంటశాలలోని యంత్రాలను పరిశీలిస్తున్న జాగృతి యాత్ర సభ్యులు

- అక్షయ పాత్ర వంటశాలను పరిశీలించిన యువ పారిశ్రామికవేత్తలు

ఆనందపురం : ప్రపంచంలోని వివిధ దేశాలలోని వర్తమాన పరిస్థితులను అవగతం చేసుకోవడానికి పారిశ్రామిక రంగంపై ఆసక్తి గల వివిధ దేశాలయువ పారిశ్రామిక వేత్తల చేపట్టిన ప్రపంచ జాగృతి యాత్ర గురువారం ఆనందపురం మండలంలోని గంభీరానికి చేరుకుంది. ఇందుకోసం 18 బోగీలు కలిగిన ప్రత్యేక రైలును జాగృతి యాత్ర సభ్యులు ఏర్పాటు చేసుకున్నారు. గత నెల 28న ముంబైలో ప్రారంభమైన ఈ యాత్రలో భాగంగా దేశంలోని 10 మహానగరాలను సందర్శించిన సభ్యులు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో 15 ఏళ్లుగా గంభీరంలో నిర్వహిస్తున్న అక్షయ పాత్ర వంటశాలను సందర్శించారు. జీ–20 దేశాల సభ్యులతో పాటు 23 దేశాల నుంచి 62 మంది ప్రతినిధులు, 488 మంది సభ్యులు ఈ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రెసిడెంట్ సత్య గౌర చంద్రదాస వంటశాల విశేషాలను జాగృతి యాత్ర సభ్యులకు వివరించారు. వందలాది మంది విద్యార్థులకు ఆధునిక యంత్రాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్న విధానాలను వివరించారు. మానవ శక్తిని తక్కువగా వినియోగిస్తూ తక్కువ సమయంలోనే వేలాది మందికి ఆహార పదార్థాలను తయారుచేసి అందిస్తున్న విధానం చూసి యువ పారిశ్రామిక వేత్తలు ముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అక్షయ పాత్ర ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం సీఎం జగన్‌కు వినతి

సీతమ్మధార: విశాఖలో గుర్తింపు పొందిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ విశాఖ అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. గురువారం విశాఖ వచ్చిన సీఎం జగన్‌ను ఐటీ హిల్స్ హెలిప్యాడ్ వద్ద సొసైటీ గౌరవ అధ్యక్షుడు, సాక్షి బ్యూరో చీఫ్ కె.జి.రాఘవేంద్రారెడ్డి, అధ్యక్షుడు బి.రవికాంత్, ఉపాధ్యక్షుడు దుక్క మురళీకృష్ణారెడ్డి తదితరులు కలిశారు. సొసైటీ ద్వారా రిజిస్టర్ అయిన అక్రిడిటెడ్ జర్నలిస్టుల జాబితాను ముఖ్యమంత్రికి అందజేశారు. 18 ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్న జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ అంశంపై తగిన చర్యలు చేపట్టాలని వ్యక్తిగత కార్యదర్శి ధనుంజయరెడ్డికి సూచించారు.


ఇళ్ల స్థలాలకు సంబంధించి ముఖ్యమంత్రికి వినతిపత్రం అందిస్తున్న హౌసింగ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు

డిసెంబర్ 1,2 తేదీల్లో నేరెడ్కో ప్రాపర్టీ షో


నేరెడ్కో బ్రోచర్‌ను ప్రదర్శిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ప్రతినిధులు

పీఎంపాలెం: రియల్ ఎస్టేట్ రంగంలో విశాఖ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(నేరెడ్కో) ఉత్తరాంధ్ర, విశాఖ శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 1, 2 తేదీల్లో నిర్వహించనున్న ప్రాపర్టీ షో పురస్కరించుకుని విశాఖ కన్వెన్షన్ హాలులో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బిల్డర్‌గా వేలాది మందికి సొంత ఇంటిని సమకూర్చడం గర్వకారణంగా ఉందన్నారు. తోటి బిల్డర్లు, రియల్టర్లు గొప్ప అవకాశంగా భావించి నగర ఉన్నతికి భాగస్వాములు కావాలన్నారు. నేరెడ్కోను మరింత ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. విశాఖ పరిపాలన రాజధానిగా అవతరించడం ఖాయమన్నారు. నేరెడ్కో జాతీయ అధ్యక్షుడు హరిబాబు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సొంతింటి కలను నిజం చేయడమే సంస్థ లక్ష్యమన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు చక్రధర్ మాట్లాడుతూ విభిన్న రకాల ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు, విల్లాలు, హాలిడే హోమ్‌లకు సంబంధించి పూర్తి సమాచారం, గృహోపకరణాలు, బ్యాంకర్ల వివరాలు తెలియజేసేందుకు ప్రాపర్టీ షో వేదికగా నిలుస్తుందన్నారు. ప్రాపర్టీ షో కన్వీనర్ విద్యాసాగర్, రమేష్ బాబు, ప్రతినిధులు వెంకన్న చౌదరి, దండమూడి పాపారావు, సుబ్బారావు, వరదా సునీల్, నాగకుమార్‌రెడ్డి, బైరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తల్లి ఫ్లైఓవర్‌పై మరో ప్రమాదం

- మానవత్వం చాటుకున్న డిప్యూటీ మేయర్


స్ట్రెచర్‌పై క్షతగాత్రుడిని ఎక్కిస్తున్న జియ్యాని శ్రీధర్, బీఎస్ కృష్ణ

అల్లిపురం: డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మానవత్వాన్ని చాటుకున్నారు. హెచ్‌పీసీఎల్ ఉద్యోగి, మరో వ్యక్తి గురువారం తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై బైక్‌పై వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమా దంలో ఉద్యోగి అపస్మారక స్థితికి చేరుకోగా.. మరొకరికి చేయి విరిగిపోయింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న జియ్యాని శ్రీధర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ వారిని గమనించారు. వెంటనే తమ వాహనం ఆపి.. అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. క్షతగాత్రులను దగ్గరుండి కేజీహెచ్‌కు తరలించారు.

అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలు ప్రారంభం

అగనంపూడి: క్రీడాకారులకు సమాజంలో ఉన్నతమైన గుర్తింపు ఉంటుందని జేఎన్‌టీయూ గురజాడ (విజయనగర) ఫిజికల్ డైరెక్టర్ కె.నాగరాజు అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూ గురజాడ పరిధిలోని అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించనున్న పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా పరపతితోపాటు సమాజంలో మంచి స్థానం పొందే వీలుంటుందన్నారు. ఏ రంగంలోనైనా కృషి, పట్టుదల ఉంటే ఉన్నత స్థానం దక్కుతుందన్నారు. విజ్ఞాన్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ మాట్లాడుతూ పోటీలకు కళాశాల వేదికగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. గెలుపోటములు పక్కన పెట్టి క్రీడాకారులు స్ఫూర్తిని చాటుకోవాలన్నారు. పోటీల్లో మూడు జిల్లాల నుంచి 15 జట్లు, 2వందల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజ్ఞాన్ సీఈవో శ్రీకాంత్ విజ్ఞాన్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్.రాంబాబు, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర పాల్గొన్నారు.

పలాస, రాయగడ పాసింజర్ రైళ్ల పునరుద్ధరణ

తాటిచెట్లపాలెం: కంటకాపల్లి–అలమండ మధ్య జరిగిన రైల్వే ప్రమాదం అనంతరం ట్రాక్ పునరుద్ధరణ పనులను రికార్డు సమయంలో పూర్తి చేసిన అధికారులు.. అంతే వేగంగా పలాస, రాయగడ రైళ్లను నడిపారు. ఈ మార్గంలో విద్యార్థులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు నిత్యం ఈ రైళ్లలోనే ప్రయాణిస్తుంటారు. ప్రమాదం కారణంగా ఈ రైళ్లను రద్దు చేశారు. డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ పర్యవేక్షణలో చేపట్టిన చర్యలతో ఈ నెల ఒకటి నుంచి విశాఖపట్నం–రాయగడ, గురువారం నుంచి విశాఖపట్నం–పలాస పాసింజర్ రైళ్లను పునరుద్ధరించినట్లు సీనియర్ డీసీఎం ఎ.కె త్రిపాఠి తెలిపారు.

కొనసాగిన విచారణ

రైలు ప్రమాదంపై డీఆర్ఎం కార్యాలయంలో రెండో రోజు కూడా కొనసాగింది. ముందుగా ప్రమాదంలో మరణించిన వారికి నివాళి అర్పిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఏడీఆర్ఎంలు సుధీర్ కుమార్ గుప్తా(ఇన్‌ఫ్రా), మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్ పని గంటల నిర్ణయం సరైందే..

- పారిశ్రామిక వేత్త, అంతర్జాతీయ రచయిత శ్రీధర్ బెవర



సాక్షి, విశాఖపట్నం: పని సంస్కృతి, భారతీయ యువత అంకిత భావాన్ని పెంపొందించేందుకు వారానికి 70 గంటల పని దినాలపై ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి తీసుకున్న నిర్ణయం సరైందేనని ప్రముఖ పారిశ్రామికవేత్త, అంతర్జాతీయ రచయిత శ్రీధర్ బెవర వ్యాఖ్యానించారు. పనిచేస్తున్న సంస్థలో రాణిస్తూ నిపుణులుగా మారడానికి, పోటీతత్వం మెండుగా ఉండేందుకు పనిలో అదనపు సమయం ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి వ్యాఖ్యల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశాన్ని అతి కొద్ది మంది మాత్రమే అర్థం చేసుకున్నారన్నారు. ఎంచుకున్న డొమైన్‌లో అగ్రస్థానంలో లేదా గౌరవప్రదమైన స్థానంలో ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్న వారికి సంస్థలో నైపుణ్యత కలిగిన వారు ఉండాలన్నదే నిజమైన మార్గమని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. దీనికి ఉద్యోగుల నుంచి కూడా సహకారం అందాలన్న ఇన్ఫోసిస్ నిర్ణయాన్ని తాను సమర్థిస్తున్నానన్నారు. ఏదో మొక్కుబడిగా కేవలం రోజుకి ఇన్ని గంటలు లేదా నెలకు ఇన్ని రోజులు మాత్రమే పని చేస్తామని భావించకూడదని శ్రీధర్ బెవర హితవు పలికారు. విశిష్ట రచయిత, మాల్కమ్ గ్లాడ్వెల్ తన పుస్తకం ‘అవుట్ లయర్స్’లో చెప్పినట్టుగా, ఒక రంగంలో ప్రపంచం దాసోహం అయ్యే నిపుణులు కావాలంటే కనీసం పదివేల గంటలు నిబద్ధతతో పని చేసి ఉండాలన్న మాటల్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఇప్పటికైనా పని గంటల దుమారానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని శ్రీధర్ బెవర సూచించారు.

జనవరిలో రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు


మాట్లాడుతున్న మాజీమంత్రి, సాహిత్య ప్రయోక్త దాడి వీరభద్రరావు

సీతంపేట: విశాఖ వేదికగా వచ్చే జనవరి 4 నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రస్థాయి కథా నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు మాజీమంత్రి, సాహిత్య ప్రయోక్త దాడి వీరభద్రరావు అన్నారు. అజో విభో కందాళం ఫౌండేషన్, రైటర్స్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించే 31వ వార్షిక సభల విశిష్ట పురస్కారాల వివరాలను పౌర గ్రంథాలయంలో గురువారం ఆయన మీడియాకు వెల్లడించారు. 30 ఏళ్లుగా నాటిక సాహిత్య ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం సాహిత్య గోష్ఠి, సాయంత్రం నాటకాల ప్రదర్శన ఉంటుందన్నారు. పోటీలకు 36 నాటికలు పరిశీలనకు రాగా.. వాటిలో 8, 9 నాటికలు ఎంపిక చేస్తామన్నారు. ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ జి.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ సాహిత్యంలో అత్యంత ప్రతిభ గల వారికి రూ.లక్ష నగదుతో పాటు పురస్కారాలు అందజేస్తామన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అప్పాజోస్యుల సత్యనారాయణ, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ సాహిత్యంలో నిష్ణాతులైన ఐదుగురికి సదస్ మనీ ప్రైజ్ కింద రూ.10 వేలు చొప్పున అందజేస్తామన్నారు.

పురస్కార గ్రహీతలు వీరే..

అపురూప సాహితీవేత్త యల్లపు ముకుంద రామారావుకి 2024 ప్రతిభ మూర్తి జీవితకాల సాధన పురస్కారంతో పాటు రూ.లక్ష నగదు, కవి, అనువాదకులు డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావుకు విశిష్ట సాహితీ మూర్తి జీవితకాల సాధన పురస్కారంతో పాటు రూ.50వేల నగదు బహుమతి, ఆంగ్ల భాషా అధ్యాపకులు మల్లిపురం జగదీష్‌కు సరిలేరు నీకెవ్వరు విశిష్ట గిరిజన కథా సాహిత్య పురస్కారంతోపాటు రూ.25 వేల నగదు బహుమతి అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.